క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఉపాధ్యాయిని మృతి



పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న తీగల వెంకటరమణ (40) జ్వరంతో బాధపడుతూ కొద్ది రోజులుగా ఖమ్మంలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించి మంగళవారం మృతి చెందారు. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహన్ని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు వూట్ల నాగేశ్వరరావు, పలువురు సందర్శించి నివాళులర్పించారు. స్థానిక పాఠశాలలో విధుల్లోకి వచ్చిన ఆమె వృత్తి పట్ల ఎంతో అంకిత భావంతో పనిచేసేవారని తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది వాపోయారు. విద్యార్థులు కూడా ఆమె మృతిని జీర్ణించుకోలేక పోతున్నారు. ఆమె మృతదేహన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు.

చిరుధాన్యాలపై అవగాహన



గరికపాడు(జగ్గయ్యపేట): స్థానిక కేవీకేలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వేరుశనగ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా కేవీకే కో ఆర్డినేటర్ కృష్ణరాజు మాట్లాడుతూ మహిళలు చిరుధాన్యాల హార ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. అనంతరం మహిళలకు చిరుధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి, మహిళా కూలీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు

నందిగామ: ఓ వృద్ధుడు బావిలో పడి మృతి చెందిన ఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. కేరళ ప్రాంతానికి చెందిన రామచంద్రన్ (70) పది సంవత్సరాలుగా ఒంటరిగా నందిగామ పట్టణంలోని రైతు పేట డౌన్ ప్రాంతంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ తాపీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇంటి ప్రాంగణంలో ఉన్న బావిలో రామచంద్రన్ మృతదేహన్ని గుర్తించారు. బావిలో రామచంద్రన్ ఎప్పుడు పడి మృతి చెందాడో కానీ మంగళవారం దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావు తెలిపారు.

వర్షం..రైతుల హర్షం



నందిగామ: నందిగామ ప్రాంతంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా భానుడు వేసవి తలపించేలా మండిపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం కారణంగా వాతావరణం కాస్త చల్లబడింది. ఇదిలా ఉండగా ఈ వర్షం పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రేపు జాషువా జయంతి

కంచికచర్ల : మహాకవి, నవయుగ కవి చక్రవర్తి, గుర్రం జాషువా జయంతిని ఈనెల 28వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు బహుజనుల రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ మంగళవారం తెలిపారు. గుర్రం జాషువా జీవిత చరిత్రపై విద్యార్థులకు పలు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ప్రముఖ రంగస్థల కళాకారులు, కవులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సోనీ పిలుపునిచ్చారు.

ట్రావెల్ బస్సు డ్రైవర్ల మధ్య వివాదం

నందిగామ: ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్లు ఒకరిపై ఒకరు నందిగామ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం హైదరాబాదు నుంచి ఒకే ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సులు సోమవారం రాత్రి విజయవాడకు బయలుదేరాయి. ఆ రెండు బస్సుల డ్రైవర్ల మధ్య మార్గ మధ్యంలో వివాదం జరిగింది. ఆ సందర్భంలో ఒక బస్ డ్రైవర్ మరో బస్ డ్రైవర్ అయిన నందిగామ పట్టణానికి చెందిన రాకేష్‌ను గాయపరిచాడు. గాయపడ్డ బస్ డ్రైవర్ వెంటనే నందిగామ పట్టణంలో ఉన్న వారి బంధువులకు సమాచారమందించాడు. స్థానికులు వెంటనే నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆ బస్సును నిలుపుదల చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో మరో బస్సు డ్రైవర్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రూ.78 కోట్లతో నియోజకవర్గంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్లు
- సత్వర చర్యలకై ఆర్‌డబ్ల్యూఎస్ సీఈతో సమావేశం
- వివరాలు వెల్లడించిన ప్రభుత్వ విప్ ఉదయభాను



విజయవాడలో ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ గాయత్రితో సమావేశమై మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ మేరకు మంగళవారం విజయవాడ గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ గాయత్రితో ఉదయభాను సమావేశమయ్యారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్యలను వివరించి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వివరాలు వెల్లడించారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి ఇప్పటికే జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన రూ.78 కోట్ల నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకులు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు గాను త్వరితగతిన టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని వత్సవాయి గ్రామానికి తాగునీటి పైపులైను, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలకు మంజూరైన రూ.3.26 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. పెనుగంచిప్రోలు గ్రామానికి మంజూరైన రూ.2.18 కోట్ల నిధులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభం అయ్యేలా చూడాలన్నారు. శివాపురం గ్రామానికి మంజూరైన రూ.2.93 కోట్లతో తాగునీటి పైపులైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తిచేసి జగ్గయ్యపేట నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ, డీఈ రవికుమార్, ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణపతి ఉత్సవాలు



ముండ్లపాడులో గణనాథుని నిమజ్జన ఊరేగింపు



పేట చెరువు బజారులో పూజలు చేస్తున్న శ్రీకాంత్



నందిగామ పట్టణంలోని ముక్కోటి మండపంలో నిర్వహించిన పుష్పయాగం



పెనుగంచిప్రోలులో అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్‌ఐ దుర్గాప్రసాద్



అభయాంజనేయస్వామి వీధిలో మండపంలో వీవీ యూత్ సభ్యులు



చెరువు బజారులో డీఏ ఫ్రెండ్స్ మండపం వద్ద అన్నదానం

పెనుగంచిప్రోలు: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి మండపం వద్ద తొమ్మిదవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. గణపతి నిమజ్జన కార్యక్రమం బుధవారం నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. పాత సినిమాహాల్ సెంటర్‌లో వీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రుల పందిరి వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఎస్‌ఐ సీహెచ్ కె.దుర్గాప్రసాద్ ప్రారంభించారు. మండపం వద్ద గత ఆరు సంవత్సరాలుగా సముద్రాల గోపాలస్వామి, విజయలక్ష్మి దంపతులు అన్నదానానికి విరాళం అందిస్తున్నారని కమిటీ నిర్వాహకులు తెలిపారు. మండలంలోని ముండ్లపాడు గ్రామంలో మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా గణపతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 9వ రోజైన మంగళవారం పలు మండపాల్లో విశేష పూజలు నిర్వహించారు. నందిగామ పట్టణంలోని ముక్కోటి మండపంలో ఏర్పాటు చేసిన పర్యావరణ గణపతి విగ్రహానికి పలు రకాల 5 క్వింటాళ్ల పూలతో పుష్ప యాగం నిర్వహించారు. సాయంత్రం సమయంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వాసవి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహం వద్ద విశేష పూజలతో పాటు బుల్లితెర ఆర్టిస్టులతో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. మెయిన్ బజార్, గాంధీ సెంటర్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో గణపతి మండపాల వద్ద పూజలు నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు.

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో పలు చోట్ల మండపాలలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహాల వద్దకు భక్తులు తరలివచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక చెరువు బజారులో ధనమూర్తి, అయ్యప్ప(డీఏ) ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుని విగ్రహం వద్ద జరిగిన పూజా కార్యక్రమం, అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. వెండి దేవాలయం వెనుక వీవీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలోని పూజా కార్యక్రమంలో యూత్ సభ్యులు కనుమరులపూడి సైదాబాబు, గరికపాటి శేఖర్‌బాబు, గొల్లపూడి చంద్రశేఖర్, కర్రి రవితేజ పాల్గొన్నారు.

వీరులపాడు: మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం మండలంలోని జుజ్జూరు, పెద్దాపురం, జయంతితో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలకు పూజల అనంతరం రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై భారీగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంచికచర్ల : స్థానిక మోడల్‌కాలనీ, పెట్రోలు బంక్ సెంటర్, వసంతకాలనీ, పోలీస్‌స్టేషన్ సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పెట్రోలు బంక్ సెంటర్‌లో కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన బాల వినాయకుడి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 800 మందికి అన్న సమారాధన చేశారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సమగ్రశిక్ష జిల్లా సీఎంవో టి.రమేష్ సూచించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. తొలుత పాఠశాలలో మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలకు క్రమశిక్షణ, సమయపాలన, ప్రణాళికతో ప్రిపేర్ అవ్వాలని సూచించారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మూడో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నారని, పాఠశాలకు అదనపు తరగతి గదుల అవసరమని ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు రమేష్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన తక్షణమే ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరుకు సిఫార్సు చేస్తామన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

జి.కొండూరు: జి.కొండూరు గుడిసెంటర్లో గుర్తు తెలియని వృద్ధురాలు(60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై ధర్మరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలు గత సంవత్సర కాలంగా గ్రామంలో బిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసినవారు తమను 08662802233, 94407 96448లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

అసభ్య ప్రవర్తన కేసులో నిందితుడికి జైలు

గన్నవరం: వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన మరిదికి ఏడాది జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని కేసరపల్లికి చెందిన కొల్లి ప్రసన్న పట్ల ఆమె మరిది శ్రీకాంత్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడనే ఫిర్యాదుపై 2021 అక్టోబర్ 23న పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు పూర్తిచేసిన గన్నవరం పోలీసులు 12వ ఏఎంఎం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన న్యాయస్థానం శ్రీకాంత్‌పై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష పొడగించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీ ప్రసన్న తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం

గంపలగూడెం: గర్భిణులు, బాలింతలు తగిన పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటమే కాక వారికి పుట్టబోయే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం-182వ అంగన్‌వాడీ కేంద్రం, ఊటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యకర్తలు మాట్లాడుతూ పోషకాలు ఉండే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఊటుకూరులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకటకుమారి, కార్యకర్తలు నాగేశ్వరమ్మ, స్రవంతి, నాగమణి, బుజ్జి,నజీమా, హెచ్‌ఎం మంజుల పాల్గొన్నారు.

జెమినీ వైరస్ తెగులు నివారణ చర్యలు చేపట్టాలి

తిరువూరు ఉద్యాన శాఖ అధికారి సోహైల్ అహ్మద్



కొణిజెర్లలో మిరప చేలో రైతులకు సూచనలిస్తున్న హెచ్‌ఓ సోహైల్ అహ్మద్

కొణిజెర్ల(గంపలగూడెం): మిరప పైరులో జెమినీ వైరస్(బొబ్బర) ఆశించిందని, తక్షణమే రైతాంగం నివారణ చర్యలు తీసుకోవాలని తిరువూరు ఉద్యాన శాఖ అధికారి సోహైల్ అహ్మద్ తెలిపారు. గంపలగూడెం మండలం కొణిజెర్లలో రైతులతో కలిసి ఆయన మిరపచేలను మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణం కారణంగా రసం పీల్చే పురుగు ఉధృతి పెరిగి వైరస్ వ్యాప్తికి అవకాశం ఏర్పడుతుందన్నారు. చేలో ముందుగా జెమినీ వైరస్ సోకిన మొక్కలను గుర్తించి పీకివేయాలన్నారు. మోతాదుకు మించి కాంప్లెక్స్ ఎరువులు వాడకం వల్ల భూమిలో భాస్వరం ఎక్కువై సూక్ష్మపోషకాలు మొక్కకు అందకపోవడంతో బలహీనపడి వైరస్ తెగులు ఆశిస్తుందనే విషయం రైతులు గ్రహించాలన్నారు. వైరస్ వ్యాప్తికి కారకాలైన తెల్లదోమ, తామరపురుగు యొక్క ఉధృతిని ప్రధానంగా రైతులు గమనించాలన్నారు. దీనికోసం పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 30 వరకు ఏర్పాటు చేయాలన్నారు. తెల్లదోమ ఉధృతిని అరికట్టేందుకు పైరిప్రాక్సిఫెన్(లానో) 10శాతం ఇసీని ఎకరానికి 200 ఎంఎల్ చొప్పున వేపనూనెలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

శరవేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



పెనుగంచిప్రోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య రక్షణ కార్యక్రమమని వైద్యాధికారులు పి.ఇందిర, సుజని అన్నారు. మంగళవారం పెనుగంచిప్రోలు, పలు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వేలో వారు పాల్గొన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ప్రజలు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

86 మందికి వైద్య పరీక్షలు

నందిగామ: లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కేవీఆర్ కళాశాల ఆవరణలో మంగళవారం పలు రకాల క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. లైన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ చిన్నా ఆధ్వర్యంలో మణిపాల్ హాస్పిటల్ వైద్య సిబ్బంది 86 మంది మహిళలకు స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు లైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు .

జగనన్న పాలవెల్లువపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ భవానీ ప్రసాద్



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి అనిల్

శనగపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు, పాడిరైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి అనిల్ మాట్లాడుతూ మండలంలోని ముండ్లపాడు, శనగపాడు, కొణకంచి, నవాబుపేట, వెంకటాపురం, వెంగనాయకునిపాలెం గ్రామాల్లో అమూల్ ద్వారా పాల సేకరణ జరుగుతుందన్నారు. రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శనగపాడు, వెంగనాయకునిపాలెం సర్పంచ్‌లు కీసర సైదులు, భూమన నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పారుపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పాడి రైతులకు జగనన్న పాల వెల్లువ ద్వారా గిట్టుబాటు ధర వస్తుందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువపై మహిళలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా పాడి రైతులు పాల దిగుబడి పెంచాలన్నారు. ముఖ్యంగా జగనన్న పాల వెల్లువ కేంద్రాలలో మహిళా డెయిరీ సహకార సంఘం ద్వారా పాల సేకరణ జరిపి నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. మహిళా రైతుకు జిల్లా సహకార బ్యాంకు ద్వారా రూ.40 వేల నుంచి లక్ష వరకు తక్కువ వడ్డీకి రుణాలు కూడా పాడి గేదెలు కొనుగోలుకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమూల్ సంస్థ ద్వారా వెన్న శాతాన్ని బట్టి పాల గిట్టుబాటు ధర కల్పించటం జరుగుతుందన్నారు. ఎంపీడీవో రమేష్‌బాబు, పశువైద్యులు శ్రీను నాయక్, మురళీకష్ణ, లక్ష్మీప్రసన్న, కేడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఉష, మహిళా రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఓంకార్, పీడీ నాగమల్లేశ్వరరావు

కంచికచర్ల : మండలంలోని గనిఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించటంతో పాటు పలు క్రీడల్లో మంచి మెరుగైన తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఇటీవల నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్, యోగా పలు ఆటల్లో మంచి ప్రతిభ కనబర్చి ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. మొత్తం 15 మంది విద్యార్థులు తమ ప్రతిభ కనపర్చి పాఠశాలకు పేరు తీసుకువచ్చారని తెలిపారు. పీడీ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు



బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ కార్మికులు

పెనుగంచిప్రోలు: దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా మంగళవారం పెనుగంచిప్రోలులో చెత్త కుప్పలు, రోడ్డు పక్కన పడేసిన చెట్ల కొమ్మలు తొలగించటంతో పాటు ప్రతి వీధాలోనూ బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ గ్రామంలో దోమల నిర్మూలనకు ముందస్తు చర్యల్లో భాగంగా దోమల మందు స్ప్రే చేయించామన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా గ్రామంలో ఎక్కడా చెత్త, చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామని వివరించారు. గ్రామస్తులు కూడా పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పెనుగంచిప్రోలు: చిత్తూరు జిల్లా పెనుమూరు గ్రామంలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలిక భవ్యశ్రీని అతి కిరాతకంగా చంపిన నలుగురు దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి తప్పులు చేసిన వారిని తక్షణమే శిక్షించాలన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: చిత్తూరు జిల్లాలో పెనుమూరు గ్రామంలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికపై నలుగురు కామాంధులు విచక్షణా రహితంగా అతి కిరాతకంగా గుండు గీసి, కనురెప్పలు తొలగించి ఆమె జుట్టుతోనే ఉరి వేసి చంపి బావిలో పడవేయడం సభ్య సమాజాన్ని తీవ్ర మనోవేదనకి గురిచేసిందని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనల వలన సభ్య సమాజం తల దించుకోవాల్సి వస్తుందన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

వికేంద్రీకరణతోనే అభివృద్ధి

జగ్గయ్యపేట అర్బన్: వికేంద్రీకరణతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని, తద్వారా వేగవంతంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ పంచాయతీరాజ్ విభాగం మాస్టర్ ట్రైనర్ పెంటి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన జీవన ప్రమాణాలను పెంపొందించేలా గ్రామాల అభివృద్ధి సూచికల పేరుతో పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ అనే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు. మొదటి విడతగా 17 రకాల సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌కు సంబంధించిన క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాల స్థితిగతుల వివరాలను గ్రామాల వారీగా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన విధి విధానాలను ఒకేచోట క్రోడీకరించినందుకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ 558 జీవో ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కైలా శ్రీనివాసరావు

నున్న(విజయవాడరూరల్): డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కైలా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నున్న గ్రామంలో డ్వాక్రాగ్రూపుల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ 2023-24వ సంవత్సరానికి సంబంధించిన గ్రామైక్య సంఘాల రికార్డులను తనిఖీ చేశారు. కామన్ ఇన్వెస్ట్‌మెంటు ఫండ్, స్త్రీనిధి, ఏపీఐఆర్‌జీపీ(ఆంధ్రప్రదేశ్ రూరల్ ఇన్‌క్లూసివ్ గ్రోత్ ప్లాన్) కింద ప్రభుత్వం విడుదల చేసిన గ్రాంట్ల రికార్డులను పీడీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు చేరాల్సిన లబ్ధి కచ్చితంగా అందాలన్నారు. సమావేశంలో డీపీఎం శోభన్‌బాబు, స్త్రీ నిధి ఏజీఎం శోభ, ఏపీఎం జి.చంద్రశేఖర్, సీసీ కొండలరావు, రామారావు, వీఓఏలు పాల్గొన్నారు.